ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

చిత్తూరు జిల్లా వార్తలు
మంగళవారం 25 ఫిబ్రవరి 2025


హంసవాహనంపై ఊరేగుతున్న మొగిలీశ్వరుడు

ఎంతమందిపై చర్యలుంటాయో?

- ఫ్రీహోల్డ్ అక్రమాల్లో 3 మండలాలు టాప్ 10 జాబితాలో
- వెదురుకుప్పంలో ఎక్కువగా అక్రమ రిజిస్ట్రేషన్లు

వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు డీకేటీ భూముల్ని అక్రమంగా ఫ్రీహోల్డ్ భూములుగా మార్చుకుని పెద్దఎత్తున లబ్ధి పొందిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఇలా ఫ్రీహోల్డ్ చేసుకున్న టాప్ 10 మండలాలను సీసీఎల్ఏ విడుదల చేస్తే అందులో మన జిల్లాకు చెందిన మూడు మండలాలు వి.కోట, కుప్పం, బంగారుపాళ్యం ఉండడం గమనార్హం. ఫ్రీహోల్డ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్లకు సంబంధించి టాప్ 10 జాబితాలోనూ మన జిల్లాకు చెందిన వెదురుకుప్పం మండలం ఉంది. అప్పట్లో ఈ ప్రాంతాల్లో పనిచేసిన రెవెన్యూ శాఖలోని అన్ని శాఖల ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని సీసీఎల్ఏ ఆయా జిల్లాల కలెక్టర్లకు ఈ నెల 4వ తేదీన ఆదేశాలు జారీ చేసింది. 20 రోజులు గడిచినా.. ఎలాంటి చర్యలకూ జిల్లా అధికారులు ఉపక్రమించకపోవడంపై రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



చిత్తూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కూటమిప్రభుత్వం వచ్చాక వైసీపీ హయాంలో జరిగిన అక్రమ ఫ్రీహోల్డ్‌లను గుర్తించింది. జిల్లాలో మొత్తం 1.59 లక్షల ఎకరాల్ని ఫ్రీహోల్డ్ చేస్తే.. వాటిలో 1.05 లక్షల ఎకరాలను అక్రమంగా, 54 వేల ఎకరాల్ని సక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినట్లు ప్రస్తుత జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. అలాగే ఫ్రీహోల్డ్ భూములకు జరిగిన రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తే.. జిల్లాలో మొత్తం 2561 ఎకరాల రిజిస్ట్రేషన్లు జరిగితే, వాటిలో 1345 ఎకరాల్ని అక్రమంగా, 1216 ఎకరాల్ని సక్రమంగా రిజిస్ట్రేషను చేసినట్లు తేలింది. పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని గుర్తించిన కూటమి ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూములను హోల్డ్‌లో పెట్టేసి, రిజిస్ట్రేషన్లను ఆపేసింది. ఇప్పుడు కూడా ఫ్రీహోల్డ్ భూముల విషయంలో ఆ విధానమే కొనసాగుతోంది.

● ఆ మూడు మండలాల్లో అక్రమాలు..

రాష్ట్రంలో ఫ్రీహోల్డ్ అక్రమాలు పెద్దఎత్తున జరిగిన 10 మండలాల వివరాలను ప్రభుత్వం విడుదల చేస్తే 4, 5, 10 స్థానాల్లో వి.కోట, కుప్పం, బంగారుపాళ్యం మండలాలు నిలిచాయి. వి.కోట మండలంలో మొత్తం 12,226 ఎకరాల డీకేటీ భూములను ఫ్రీహోల్డ్‌గా మార్చితే.. వాటిలో అత్యధికంగా 9,243 ఎకరాలు అక్రమమని తేలాయి. అలాగే కుప్పం మండలంలో 8674 ఎకరాల్ని ఫ్రీహోల్డ్ చేస్తే, 8400 ఎకరాలు అక్రమమని తేలాయి. బంగారుపాళ్యంలో 8042 ఎకరాల్లో 7198 ఎకరాలు అక్రమమని తేలాయి. ● ఇదే విధంగా అన్నమయ్య జిల్లాలోని గుర్రంకొండ మండలంలో 11,774 ఎకరాల్లో 7740 ఎకరాల్ని అక్రమంగా ఫ్రీహోల్డ్ చేశారు. ఇది టాప్8లో ఉంది.

● వెదురుకుప్పంలో అక్రమ రిజిస్ట్రేషన్లు


ఫ్రీహోల్డ్ అయ్యాక జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల విషయంలో టాప్ 10 జాబితాను ప్రభుత్వం విడుదల చేస్తే.. మూడో స్థానంలో వెదురుకుప్పం మండలం ఉంది. ఇక్కడ మొత్తం 492 ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల్ని రిజిస్ట్రేషను చేస్తే, 279 ఎకరాలు అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినవే. ● ఇదేవిధంగా తిరుపతి జిల్లాలోని ఏర్పేడు మండలంలో 236 ఎకరాల రిజిస్ట్రేషన్లు జరిగితే, 204 ఎకరాలు అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసినవి. ఈ మండలం టాప్ 10లో ఏడో స్థానంలో ఉంది.

1.05 లక్షల ఎకరాల ఫ్రీహోల్డ్ భూముల రద్దు

జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్ని అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసుకున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వాటన్నింటినీ హోల్డ్‌లో పెట్టేయగా.. మళ్లీ డీకేటీలుగా మార్చేయనున్నారు. అలాగే 1345 ఎకరాల అక్రమ ఫ్రీహోల్డ్ భూములకు రిజిస్ట్రేషను జరిగినట్లు తేలింది. ఈ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి, ఆ భూముల్ని ఫ్రీహోల్డ్ జాబితా నుంచి తొలగించనున్నారు.

ఆయా తహసీల్దార్లు కీలక మండలాల్లో..

వైసీపీ నాయకులకు సహకరించి అక్రమంగా ఫ్రీహోల్డ్ చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటే ఏ ఒక్కరూ మిగలరు. అందరిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అందుకే ప్రభుత్వం రాష్ట్రంలో టాప్ 10 మండలాలను మాత్రమే గుర్తించి వారిపై చర్యలు తీసుకోమని ఆదేశించింది. అప్పట్లో వి.కోట, కుప్పం, బంగారుపాళ్యం మండలాల్లో పెద్దఎత్తున అక్రమ ఫ్రీహోల్డ్‌లు చేసిన తహసీల్దార్లు ఇప్పుడు కూడా కీలక మండలాల్లో పనిచేస్తుండడం విశేషం. అప్పట్లో వి.కోటలో చేసిన చిట్టిబాబు ఇప్పుడు సీఎం చంద్రబాబు నియోజకవర్గ కేంద్రం కుప్పంలో పనిచేస్తున్నారు. అలాగే అప్పట్లో కుప్పంలో చేసిన బి.పార్వతి ప్రస్తుతం వి.కోటలో ఉన్నారు. అప్పట్లో బంగారుపాళ్యంలో పనిచేసిన బెన్నురాజ్ ప్రస్తుతం సోమల మండలంలో పనిచేస్తున్నారు. ఈ ముగ్గురూ వైసీపీ నాయకులకు అనుకూలంగా పనిచేసి పెద్దఎత్తున అక్రమ ఫ్రీహోల్డ్‌లు చేశారు. అలాగే అక్రమ ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో వెదురుకుప్పం మండలం టాప్10లో ఉంది. అప్పట్లో అక్కడ పనిచేసిన తహసీల్దార్ లక్ష్మీనారాయణ ఇప్పుడు కీలకమైన శ్రీకాళహస్తిలో పనిచేస్తున్నారు.


ధ్వజపటం ఎగురవేస్తున్న అర్చకులు

నేత్రపర్వంగా ధ్వజారోహణం

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండలంలోని స్వయంభు కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వార్షిక ఉత్సవాల్లో రెండవ రోజైన సోమవారం ఉదయం స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు గంగాధరగురుకుల్ ఆధ్వర్యంలో కలశస్థాపన చేపట్టి ఆలయం ఎదురుగా ఉన్న ధ్వంజస్తంభాన్ని పవిత్రజలాలతో అభిషేకించారు. శివయ్య ఉత్సవాల ఆరంభ సూచికంగా సకలదేవతలకూ ఆహ్వానం పలుకుతూ ధ్వజపటాన్ని ఎగురవేశారు.బంగారుపాళ్యానికి చెందిన ఆర్ముగం,భగవతి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. సోమవారం రాత్రి కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి హంస వాహనంపై క్షేత్రపురవీధుల్లో మంగళవాయిద్యాల మధ్య ఊరేగించారు.బంగారుపాళ్యానికి చెందిన కర్ణం సంక్షేమ సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు.ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్, ఈవో మునిరాజ, అర్చకులు దండపాణి గురుకుల్, హరికేష్ గురుకుల్, మంజునాథ గురుకుల్,సోము గురుకుల్ పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం అధికారనంది , రాత్రికి సింహ వాహన సేవలుంటాయి.

స్విమ్స్‌లో జీబీఎస్ అనుమానిత కేసులు

తిరుపతి(వైద్యం)/చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న జీబీఎస్ (గులియన్ బారే సింద్రోమ్) వైరస్ సోకిందన్న అనుమానంతో 17మంది తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని స్విమ్స్ అధికారులు ధ్రువీకరించడం లేదు.జీబీఎస్ వైరస్ గురించి భయపడాల్సిన పనిలేదని మాత్రం వైద్యాధికారులు చెబుతున్నారు.ఇది అంటు వ్యాధి కాదని, దీనికోసం స్విమ్స్‌లో ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయలేదని తెలిపారు.స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిలో చిత్తూరు జిల్లా గంగవరం మండలానికి చెందిన 41 ఏళ్ల వ్యక్తి, పలమనేరు మండలానికి చెందిన ఓ మహిళ వున్నారని సమాచారం.ప్రస్తుతం వీరి ఆరోగ్యం నిలకడగా ఉందని సమాచారం.

పోస్టాఫీసులో చోరీ

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరం చర్చివీధిలోని దేవరాయవీధిలో ఉన్న పోస్టాఫీసులో చోరీ జరిగింది. సీఐ జయరామయ్య కథనం మేరకు.. పోస్టాఫీసుకు వేసిన తాళాన్ని ఆదివారం రాత్రి పగలగొట్టి క్యాష్‌కౌంటర్‌లో ఉన్న రూ.62వేలను ఎత్తుకెళ్లారు.

ఆర్ఐ సరెండర్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ సంతోష్‌ను కలెక్టర్‌కు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సరెండర్ చేశారు. ఆర్ఐపై కలెక్టర్‌కు పలు ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టారు. ఆరోపణలు నిజమేనని తేలడంతో సోమవారం కలెక్టర్‌కు సరెండ్ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.


సీఎం పర్యటన ఏర్పాట్ల గురించి టీడీపీ నేతలతో చర్చిస్తున్న కలెక్టర్

1న జీడీనెల్లూరుకు సీఎం రాక

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మార్చి ఒకటవ తేదీన గంగాధరనెల్లూరుకు రానున్నారు. ప్రతి నెలా 1వతేదీన రాష్ట్రంలోని ఏదో ఒక గ్రామంలో సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆయన పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఈ పర్యటన ఖరారైనట్లు సమాచారం. దీంతో కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం గంగాధరనెల్లూరు వచ్చారు.టీడీపీ నేతలు,అధికారులతో కలిసి బీసీ కాలనీ, దళితవాడ ప్రాంతాల్లో పింఛన్ లబ్ధిదారుల ఇళ్లను, గంగాధరనెల్లూరు హైస్కూల్లో బహిరంగసభ స్థలాన్ని, రామానాయుడుపల్లె వద్ద సీఎం హెలికాప్టర్‌లో దిగేందుకు వీలుగా ఏర్పాటు చేయాల్సిన హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు.అలాగే కోటాగరం పంచాయతీ ఎట్టేరికి సమీపం 9వ మైలు వద్ద స్థలాన్ని, ఎట్టేరి దళితవాడలో పింఛన్ లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. చివరకు గంగాధరనెల్లూరులోనే ముఖ్యమంత్రి పర్యటనకు సౌకర్యంగా ఉందని కలెక్టర్ అంచనాకు వచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబునాయుడు, పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, జిల్లా టీడీపీ యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, పార్లమెంట్ టీడీపీ ఎస్సీసెల్ ప్రధానకార్యదర్శి దేవసుందరం, వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కోదండరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు గుండయ్య, ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు స్వామిదాస్, జయశంకర్‌నాయుడు, రుద్రయ్యనాయుడు, లోకనాథరెడ్డి, చెంగ్రాయ యాదవ్, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి జ్యోతిరెడ్డి, జడ్పీ సీఈవో రవికుమార్, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, ఆర్డీవో శ్రీనివాసులు, డీఎల్డీవో రవికుమార్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, పంచాయతీరాజ్ డీఈ ఆనందరెడ్డి, ఆర్అండ్‌బీ డీఈ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సదుంలో వంతెన ఫుట్‌పాత్ కూల్చివేతకు యత్నం!

- రియల్టర్ అవతారమెత్తిన ప్రభుత్వ ఉద్యోగి దుస్సాహసం


నదిని ఆక్రమించి వంతెన ఎత్తుకు తోలిన మట్టి

సదుం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారిన ఓ ప్రభుత్వ ఉద్యోగి దుస్సాహసమిది.రాజకీయ ప్రాబల్యమున్న ఆయన తన వెంచర్‌కు దారి కోసం సదుం గ్రామ నడిబొడ్డున ప్రవహించే గార్గేయ నదిపై ఇటీవలే నిర్మించిన వంతెన ఫుట్‌పాత్‌ను తొలగించేందుకు ప్రయత్నించాడు.పదిరోజుల క్రితమే నదిలో కొంతభాగాన్ని ఆక్రమించి భారీ ఎత్తున మట్టి, రాళ్లతో నింపి వంతెనకు చెందిన ఓ బ్లాక్‌ను పూర్తిగా మూసివేశాడు. ఈ విషయమై స్థానికులు మొత్తుకున్నా అధికారులు పట్టించుకోలేదు.దీంతో ఆ రియల్టర్ దూకుడు పెంచి సోమవారం తన అవసరం మేరకు వంతెన ఫుట్‌పాత్‌ను తొలగించేందుకు ప్రయత్నించాడు. స్థానికుల సమాచారంతో ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి పోలీసుల ద్వారా ఆయన ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. ఫుట్‌పాత్ తొలగించి వెంచరుకు దారి ఏర్పాటు చేస్తే అక్కడ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రియల్టర్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


వంతెన ఫుట్‌పాత్‌ను తొలగించేందుకు జరిగిన యత్నం

మాల గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాల గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎస్వీయూ అసిస్టెంట్ ఇంజినీర్ వెంట్రపాటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. తిరుపతిలో నిర్వహించిన మాల గెజిటెడ్ అధికారుల సంఘం రాయలసీమ స్థాయి సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మాల గెజిటెడ్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పదోన్నతుల్లో తగిన న్యాయం కోసం ప్రయత్నం చేస్తానన్నారు. శ్రీనివాసరావును ఏపీ మాల గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు జయరాం, దినకరమూర్తి, కృష్ణమూర్తి, మునెయ్య, శ్రీలక్ష్మి, గురుమూర్తి, మరియదాస్, దుర్గేష్ అభినందించారు.

నేటి నుంచి శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ మంగళ, బుధ, గురువారాల్లో జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. భక్తుల రద్దీని అనుసరించి మంగళవారం 87, బుధవారం 209, గురువారం 140 అదనపు బస్సులు నడపనుంది. ఇందులో తిరుపతి, కోడూరు-తలకోన, గుడిమల్లం, శ్రీకాళహస్తి-తిరుపతి, నాయుడుపేట, గూడూరు, పిచ్చాటూరు, తడ, చెన్నై, గుడిమల్లం, పుత్తూరు-సదాశివకోన, కైలాసకోన, మూలకోన, ఊత్తుకోట-సదాశివకోన, వరదయ్యపాళెం-అవంతి, కోట, నాయుడుపేట-పంట్రంగం. పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, శ్రీశైలం, మదనపల్లెకు వెళ్లనున్నాయి. ఈ కారణంగా తిరుమల, కాణిపాకం, ఇతర ప్రదేశాలకు మూడు రోజుల పాటు బస్సుల కొరత ఏర్పడే అవకాశముంది.

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 14 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

- శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.55 కోట్లు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,892
- తలనీలాలు సమర్పించినవారు: 25,930

పరమశివుడు ప్రతిష్ఠించిన యోగలింగం

- కైలాసనాథకోనలో హరోంహరా..



కైలాసనాథకోన జలపాతం



విశేష అలంకరణలో కైలాసనాథుడు

నారాయణవనం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి రమణీయత.. ఆధ్యాత్మికతల కలబోత కైలాసనాథకోన. ఉరికే జలపాతాలు.. ఎత్తయిన గిరులతో ఆహ్లాదకర వాతావరణం ఈ ప్రాంత ప్రత్యేకత. సాక్షాత్తూ పరమశివుడే ఇక్కడ అందాలకు ముగ్ధుడయ్యాడు. అందుకే ఇక్కడ కైలాసనాథుడిగా కొలువుదీరాడు. నారాయణవనం మండలం పాలమంగళం పంచాయతీ పరిధిలోని కైలాసనాథ కోనలో యోగలింగాన్ని దర్శించుకుని భక్తులు తాదాత్మ్యం చెందుతారు. హరుడి దర్శనం కోసం పరిసరాల నుంచే కాదు తమిళనాడు, కర్ణాటకల నుంచీ భక్తులు, పర్యటకులు వస్తుంటారు.

స్థల పురాణం

నారాయణవనంలో కల్యాణ వెంకన్న, పద్మావతీ దేవిల వివాహానికి ఆకాశరాజు పార్వతీ పరమేశ్వరులను ఆహ్వానించారని ఇతిహాస గాథ ప్రచారంలో ఉంది. ఆ క్రమంలోనే వచ్చిన శివపార్వతులు నయన మనోహరమైన కోన ప్రకృతిని చూసి ఆనందపరవశులయ్యారు. ఆ సమయంలోనే శంకరుడు యోగ లింగాన్ని ప్రతిష్ఠించాడని ప్రతీతి. ఈ విషయం తెలుసుకున్న అగస్త్య మహాముని కోనకు వచ్చి ఆరు మాసాలు తపస్సు చేశారని చెబుతారు. కల్యాణానంతరం వేంకటేశ్వరుడు లక్ష్మీ సమేతుడై వచ్చి పరమేశ్వరుడ్ని దర్శించుకుని అగస్త్య మహాముని ఆధ్వర్యంలో కామాక్షి అమ్మవారిని ప్రతిష్ఠించారంటారు. ఇది చాలా విశేషమైన ప్రదేశమని, పరమేశ్వరుడి జటాజూటం నుంచి గంగ జాలువారుతుందని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. స్వామికి కుడివైపు గంగాదేవి, ఎడమవైపు కామాక్షి దేవి కొలువుదీరి దర్శనమిస్తారు. కోనలో స్నానమాచరిస్తే కాశీలో పుణ్యస్నానం చేసినట్లు భావిస్తారు. వెంకట చలపతి మహత్యం పురాణంలో ఈ కోనశివుడి ప్రస్తావన ఉందని చెబుతారు.



కామాక్షి అమ్మవారు

భక్తుల తాకిడి




దేవదాయశాఖ పరిధిలోని కైలాసనాథకోన పర్యాటకులు, భక్తులతో సందడిగా ఉంటుంది. కార్తీక మాసంలో భక్తుల తాకిడి మరింత పెరుగుతుంది. ఈ పుణ్యతీర్థంలో స్నానమాచరించి, కైలాసనాథుడిని దర్శనం చేసుకుంటారు. కోనలో స్నానమాచరిస్తే సర్వపాపాలు హరించి, ముక్తి లభిస్తుందని నమ్ముతారు. అయ్యప్ప భక్తులు కూడా ఇక్కడ పుణ్యస్నానాలు చేసి మాలధరిస్తారు. శివరాత్రి సందర్భంగా ఇప్పటికే ఆధ్యాత్మిక సందడి ప్రారంభమైంది. బుధవారం వేడుక నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో కృష్ణనాయక్ తెలిపారు.

ఇలా చేరుకోవచ్చు..

పుత్తూరు నుంచి 13 కిలోమీటర్లు, నగరి నుంచి 20 కిలోమీటర్లు, తిరుపతి నుంచి 46 కిలోమీటర్లు, చిత్తూరు నుంచి 76 కిలోమీటర్లు ప్రయాణించి కైలాసకోన చేరుకోవచ్చు. పుత్తూరు బస్టాండు నుంచి రోజూ బస్సు సౌకర్యం ఉంది. నారాయణవనంలో దిగితే ఆటో, ఇతర వాహనాలుంటాయి. అటవీప్రాంతం కావడంతో రాత్రి వేళ ప్రయాణం క్షేమకరం కాదు. పర్యాటక శాఖకు చెందిన ఆరు, దేవదాయశాఖకు చెందిన మూడు అతిథిగృహాల్లో భక్తులు సేదతీరవచ్చు.



దశకంఠుడిపై పరమశివుడి విహారం



రావణ, మయూర వాహనాలపై స్వామిఅమ్మవార్ల పురవిహారం



వినాయకస్వామి, వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్పల ఊరేగింపు



హంస, యాళివాహనాల్లో ఉత్సవర్లు

బ్రహ్మోత్సవాల్లో నేడు:

- ఉదయం 9 గంటలకు: హంస- శుక వాహనసేవ
- రాత్రి 8 గంటలకు: శేష- యాళి వాహనసేవ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాల్గో రోజైన సోమవారం రాత్రి జగద్రక్షకుడైన పరమశివుడు రావణవాహనంపై అధిరోహించి పురవిహారం చేశారు. ఆయన పక్కనే జ్ఞానప్రసూనాంబ అమ్మవారు మయూర వాహనంపై ముందుకు సాగారు. అంతకుముందు అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవర్లకు విశేష అలంకరణ, పూజలు నిర్వహించారు. ఉదయం బంగారు హంస వాహనంపై స్వామివారు, బంగారు యాళివాహనంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు ఊరేగారు. ఉదయం, రాత్రి స్వామి, అమ్మవార్ల ఊరేగింపును మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప అనుసరించారు. వాహన సేవల ముందు కోలాట కళాకారుల నృత్యాలు, భక్తుల శంఖానాదం, శివనామస్మరణలు మార్మోగాయి. మాడవీధుల్లో ఉత్సవర్లను భక్తులు దర్శించుకుని కర్పూర నీరాజనాలు పలికారు. ఉభయదారులుగా కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన చిట్టాప్రగడ సీతారామాంజనేయులు కుటుంబ సభ్యులు.. జూలుగంటి సుబ్బారావు, నాగలక్ష్మి వ్యవహరించారు. ఆలయ ఈవో బాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు సారె సమర్పణ

స్వామి, అమ్మవార్లకు మంగళవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వం తరఫున సారె సమర్పించనున్నారు. మధ్యాహ్నం రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పట్టు వస్త్రాలను తీసుకురానున్నారు.

శ్రీమన్నారాయణుడి అభయం

- సూర్య, చంద్రప్రభ వాహనాలపై దర్శనం





సూర్యప్రభ వాహనం - చంద్రప్రభ వాహనంపై కల్యాణ వెంకన్న

చంద్రగిరి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు సూర్య, చంద్రప్రభ వాహనాలపై భక్తులను అనుగ్రహించారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక ఉత్సవమూర్తి ధన్వంతరి అలంకరణలో సూర్యప్రభ వాహనంపై.. రాత్రి కృష్ణుడు అలంకరణలో చంద్రప్రభ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగారు. మంగళవారం రథోత్సవం జరగనుంది.

టైరు పంక్చరవడంతో అదుపుతప్పి బస్సు బోల్తా

- 17 మందికి గాయాలు.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమం





ప్రమాదం జరిగిన ప్రదేశంలో పోలీసులు, హైవే సిబ్బంది సహాయక చర్యలు - ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చుట్టూ చీకటి. నిద్రమత్తులో ప్రయాణికులు. ఒక్క కుదుపుతో బోల్తాపడిన బస్సు. ఏమైందో.. ఏం జరిగిందో తెలియక ఒకటే అరుపులు. ఇదీ సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు క్రాస్ రోడ్డు సమీపంలో జాతీయ రహదారి పై ఆదివారం అర్ధరాత్రి దాటాక పరిస్థితి. పాండిచ్చేరి నుంచి విజయవాడకు ప్రయాణికులతో వస్తున్న మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ బస్సు ఆదివారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు క్రాస్‌రోడ్డు సమీపానికి వచ్చింది. ఆ సమయంలో టైరు పంక్చరు అయింది. వేగంగా వస్తున్న బస్సును డ్రైవరు అదుపు చేయలేకపోయారు. దీంతో హైవే రెయిలింగ్‌ను ఢీకొని దాదాపు 10 అడుగుల లోతులో బస్సు బోల్తాపడింది. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తన సిబ్బందితో అక్కడకు చేరుకొన్నారు. స్థానికుల సహకారంతో క్షతగాత్రులను బయటకు తీసి.. స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో 34 మంది ప్రయాణికులు ఉండగా, 17 మందికి గాయాలయ్యాయి. వీరిలో బస్సు రెండో డ్రైవర్ సాయి సిద్దేష్, ప్రయాణికుడు ఎ.చందుకు తీవ్ర గాయాలై, పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నైకి తరలించారు. బస్సు ముందుభాగం నుంచి సగం వరకు నుజ్జునుజ్జయ్యింది. ప్రమాదానికి కారణం అతివేగమేనని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా నగలు ఉన్నాయా?

- బ్యాంకుకు ఖాతాదారుల పరుగు
- 30 మంది బాధితుల జాబితా ప్రదర్శన
- రికవరీ చేసిస్తామంటూ అధికారుల హామీ
- కొనసాగుతున్న పోలీసు విచారణ



బ్యాంకు వద్ద ఖాతాదారులు

నాగలాపురం, ఫిబ్రవరి 24, (ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని యూనియన్ బ్యాంకుకు సోమవారం పలువురు ఖాతాదారులు క్యూకట్టారు. తమ నగలు ఉన్నాయా అంటూ సిబ్బందిని ఆరా తీశారు. డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్ చేతివాటం చూపి ఖాతాతారులకు సంబంధించిన 5,498 గ్రాముల బంగారు నగలను తీసుకెళ్లి బయట తనఖా పెట్టి రూ.2.35 కోట్లు తీసుకున్న విషయం తెలిసిందే. దీనిపై యూనియన్ బ్యాంకు తిరుపతి రీజనల్ డీజీఎం బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు బ్యాంకు మేనేజర్ తిరువరాజ్, డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్‌పై ఎస్‌ఐ సునీల్ శుక్రవారం కేసు నమోదు చేశారు. దీంతో గోల్డ్ లోన్ తీసుకున్న వారిలో ఆందోళన నెలకొంది. శని, ఆదివారాలు సెలవు కావడంతో.. సోమవారం ఖాతాదారులు బ్యాంకుకు వచ్చారు. కాగా, డిప్యూటీ మేనేజర్ సూర్యతేజ్ 30 మంది ఖాతాదారుల నగలను బయట ప్రాంతాల్లో కుదువ అంగళ్లు, ఫైనాన్స్ సంస్థల్లో కుదువపెట్టినట్లు గుర్తించారు. ఈ 30 మంది ఖాతాదారుల జాబితాను అధికారులు బ్యాంకులో అతికించారు. వీరి నగలు రికవరీ చేసిచ్చేందుకు హామీ ఇచ్చారు. మరోవైపు మిగిలిన 36 మంది ఖాతాదారులు తమ నగలను విడిపించుకునేందుకు ఎగబడ్డారు.

సీఐ కార్యాలయాన్ని సంప్రదించండి

సత్యవేడు సీఐ మురళి సోమవారం బ్యాంకు అధికారులతో విచారణ కొనసాగించారు. ఘటనపై సిబ్బందిని, బ్యాంకు అధికారులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. 30 మంది జాబితాలోని ఖాతాదారులు బ్యాంకులో కుదువ పెట్టిన నగలకు సంబంధించిన రసీదులతో సత్యవేడు సీఐ కార్యాలయాన్ని సంప్రదించి విచారణకు సహకరించాలని ఆయన కోరారు. మరో రెండు మూడు రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని, నగల రికవరీకి కొంత వ్యవధి పడుతుందన్నారు.

అధికారులే బాధ్యత వహించాలి

నా కుటుంబ అవసరాల నిమిత్తం 2024 జూలై 26వ తేదీన 234 గ్రాముల బంగారు నగలను తాకట్టుపెట్టి రూ.3.9 లక్షల రుణం తీసుకున్నా. 30 మంది బాధిత ఖాతాదారుల జాబితాలో నా పేరూ ఉంది. నా నగలకు బ్యాంకు అధికారులే బాధ్యత వహించాలి.

- చిట్టిబాబు, నాగలాపురం

బోల్తాపడిన కార్మికుల బస్సు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం సాధనవారిపాళెం వద్ద అపాచీ పరిశ్రమ బస్సు బోల్తాపడింది. బుచ్చినాయుడు కండ్రిగ నుంచి తడ మండలం మాంబట్టు వద్ద ఉన్న అపాచీ పరిశ్రమకు కార్మికులతో బస్సు బయలుదేరింది. సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో బీఎన్‌కండ్రిగ- సూళ్లూరుపేట మార్గంలో సాధనవారిపాళెం సమీపంలో తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొందరిని బీఎన్‌కండ్రిగ ఆస్పత్రిలో, మరో ఇద్దరిని సూళ్ళూరుపేట ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ మల్లికార్జున్ తెలిపారు.


ఏకాంబరేశ్వర ఆలయం


నాగేంద్ర స్వామి ఆలయం


కాశీ విశ్వేశ్వర ఆలయం


కొండ మల్లేశ్వర ఆలయం



కులందేశ్వర ఆలయం

పంచక్షేత్రాల్లో పరమశివుడు

పంచశైవ క్షేత్రాలు మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమవుతున్నాయి. చిత్తూరు నగరంతోపాటు యాదమరి,కొత్రకోనల్లో కొలువుదీరిన ఈ ఆలయాల వెనుక ఆసక్తికరమైన పురాణగాథ ప్రచారంలో ఉంది. అగస్త్య మహాముని లోక సంచారంలో భాగంగా చిత్తూరు ప్రాంతానికి వచ్చారు. కాజూరు శివ పర్వతం వద్ద ధ్యానం చేశారు. ఇక్కడి ప్రకృతి సౌందర్యం, నీవానదీతీరం ఆయన మనసును ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలోనే పంచశివలింగాలను ఆయన ఈ ప్రాంతంలో వేర్వేరు చోట్ల ప్రతిష్ఠించారు. వీటిలో మూడు చిత్తూరు నగర పరిధిలోని ఇరువారంలో నాగేంద్రస్వామి, రంగాచారి వీధిలో కాశీ విశ్వేశ్వరుడు, కట్టమంచిలో కులందేశ్వరస్వామి ఆలయాలుగా భాసిల్లుతున్నాయి. యాదమరి సమీపాన ఏకాంబరేశ్వరుడు, చిత్తూరు గ్రామీణ పరిధిలోని కొత్రకోనలో కొండ మల్లేశ్వరుడి ఆలయం భక్తుల నీరాజనాలందుకుంటున్నాయి. ఐదింటిలో ఇరువారం,రంగాచారివీధి,కొత్రకోన,కట్టమంచి శివాలయాల నిర్వహణ బాధ్యతలను దేవదాయశాఖ చేపట్టింది.యాదమరి ఏకశిలా శివాలయంగా వెలుగొందుతోంది. మొఘల్ చక్రవర్తులు,విజయనగర రాజులు, ఆంగ్లేయుల హయాంలో ఈ పంచాలయాలను కొంత మేర అభివృద్ధి చేసినట్లు చెబుతారు. ఇతిహాస చరిత్ర గల ఈ ఆలయాలను దర్శించుకోవడానికి భక్తులు ఎంతో ఉత్సాహం చూపుతుంటారు.

- చిత్తూరు కల్చరల్, ఆంధ్రజ్యోతి

బోయకొండ గంగమ్మకు రూ.59 లక్షల ఆదాయం

చౌడేపల్లె, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు ద్వారా రూ.59 లక్షల ఆదాయం చేకూరినట్లు డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో ఏకాంబరం పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ హుండీ ద్వారా రూ.59,31,902 నగదు, 51 గ్రాముల బంగారు, 540 గ్రాములు వెండి, కెనడా 100 డాలర్ నోట్లు 2, ఆస్ట్రేలియా 50 డాలర్ నోటు ఒకటి, యుఎస్ఏ 100 డాలర్ నోటు ఒకటి, శ్రీలంక రూ.100, రూ.20 నోటు ఒక్కొక్కటి వచ్చాయని వివరించారు. 44 రోజులకు ఈ ఆదాయం వచ్చిందని అన్నారు. అలాగే రణభేరి గంగమ్మ ఆలయానికి హుండీ లెక్కింపు ద్వారా రూ.34,250 నగదు వచ్చిందన్నారు. ఈ ఆదాయాన్ని పుంగనూరు ఇండియన్ బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు. ఆలయ సిబ్బంది, గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

చెరువులో పడి వివాహిత మృతి


కోమల మృతదేహం

పలమనేరు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం జల్లిపేట గ్రామ సమీపంలోని చెరువులో పడి ఓ వివాహిత మృతిచెందింది. గ్రామస్తుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి సోమవారం మృతదేహాన్ని వెలికితీశారు. మృతురాలు పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని బోడిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జగన్నాథం భార్య కోమలగా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె మృతికి గల కారణాలు తెలియలేదు. పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొన్నాంగూరు జల్లికట్టులో గాయపడిన వ్యక్తి మృతి


కరుణాకర్ (ఫైల్‌ఫొటో)

కుప్పం రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం మల్లానూరు పంచాయతీ పొన్నాంగూరు గ్రామంలో ఆదివారం జరిగిన జల్లికట్టులో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కుప్పం మండలం అడవిబూదుగూరు గ్రామానికి చెందిన కరుణాకర్ (30) వరంగల్లులో కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఆదివారం పొన్నాంగూరులో జరిగిన జల్లికట్టుకు హాజరయ్యాడు. ఎద్దులను నిలువరించే క్రమంలో పలువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ కరుణాకర్‌ను అదేరోజు బెంగళూరులోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ● అలాగే పెద్దబంగారునత్తం పంచాయతీ మార్వాడలో సోమవారం జరిగిన జల్లికట్టులో కూడా కొంతమంది గాయపడ్డారు. వీరిలో కొంతమంది స్వగ్రామాలకు వెళ్లిపోగా, మరి కొంతమంది కుప్పంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నారు.

చెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడి మృతి


నాగరాజు (ఫైల్‌ఫొటో)

శాంతిపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం కెనమాకులపల్లె పంచాయతీ గడ్డూరు గ్రామానికి చెందిన నాగరాజు అనే కల్లు గీత కార్మికుడు చెట్టుపై నుంచి జారిపడి మృతి చెందాడు. నాగరాజు సోమవారం కల్లుగీత కోసం కర్ణాటక సరిహద్దు గ్రామం గాండ్లపల్లె వద్ద కొబ్బరి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

నిఖా హాల్ నిర్మాణానికి రూ.కోటి మంజూరు

కుప్పం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): కుప్పంలోని షాదీ మహల్‌పై మొదటి అంతస్తులో నిఖా హాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసింది. మైనారిటీ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి కాటి హర్షవర్ధన్ ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడాకారులకు వీల్‌చైర్ల పంపిణీ


వీల్‌చైర్లను అందిస్తున్న జేసీ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి): వివిధ ప్రతిభావంతులైన క్రీడాకారులకు కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీలు సోమవారం వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయి పారా స్పోర్ట్స్‌లో జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వీల్‌చైర్లను అందించాలని కోరారు. దీంతో వీల్‌చైర్లను అందించారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ స్టోర్స్‌లో నూతన భవన నిర్మాణం


భూమి పూజలో పాల్గొన్న ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ జిల్లా స్టోర్స్‌లో ఏడీ, ఏఈల కార్యాలయాల నూతన భవన నిర్మాణానికి తిరుపతి, చిత్తూరు ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్‌లు కలిసి సోమవారం భూమి పూజ చేశారు. సుమారు రూ.45 లక్షల వ్యయంతో ఈ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే ఎస్‌ఈ కార్యాలయం నిర్మాణ పనులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, వాసవీలత, శ్రీనివాసులు, డీఈలు వసంతనాయుడు, ఆనంద్, ఏఈలు పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు చేశామని..

మాజీ వలంటీర్ దంపతుల దాడి

- వారి బంధువైన జవాను వాట్సా్ప్‌లో తుపాకి ఫొటో పంపి భయపెడుతున్నారు
- న్యాయం చేయాలని కలెక్టర్‌కు మొరపెట్టుకున్న ఎంఎంపురంవాసులు
- కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 220 అర్జీలు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'సర్వే నెంబరు 177-3లో మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన మాజీ వలంటీర్ సరిత, ఆమె భర్త రామకృష్ణారెడ్డి ఆక్రమించి, మా పొలాలకు దారి లేకుండా చేశారు. గతంలో దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆక్రమణలను అడ్డుకోవడంతోపాటు పొలాలకు దారిని వదలాలని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈనెల 22వ తేదీన తమపై దాడిచేసి, గాయపరిచారు. వెదురుకుప్పం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎలాంటి న్యాయం చేయలేదు' అని వెదురుకుప్పం మండలం తిరుమలయ్యగారిపల్లె పంచాయతీ ఎంఎంపురానికి చెందిన ప్రహ్లాద్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు తమ కుటుంబీకులతో కలిసి మొరపెట్టుకున్నారు. అలాగే సరిత బంధువైన ఆర్మీ జవాన్ ఒకరు తనకు ప్రభుత్వం లైసెన్స్‌డ్ తుపాకి ఇచ్చిందంటూ.. వాట్సాప్‌లో ఫొటోలు పంపి భయపెడుతున్నారని ఆరోపించారు. దీనిపై విచారించడంతోపాటు రక్షణ కల్పించాలని కోరారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 220 అర్జీలు అందాయి. వీటిల్లో.. రెవెన్యూశాఖకు 190, డీఆర్‌డీఏకు 16, పోలీసుశాఖకు 4, గృహ నిర్మాణ సంస్థకు 3, మిగిలిన శాఖలకు 7 అర్జీల చొప్పున ఉన్నాయి.


కలెక్టరేట్ వద్ద కుటుంబీకులతో ఎంఎంపురానికి ప్రహ్లాద్‌రెడ్డి, చెంగల్‌రెడ్డి

ప్రధాన అర్జీలిలా..

● గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుశస్థలి నదిలో ఎక్స్‌కవేటర్లతో ఇసుకను తోడేశారని కార్వేటినగరం మండలం కొల్లాగుంట గ్రామస్తులు దామోదరం, పవన్‌కుమార్, జయకుమార్, బాబు తెలిపారు. దీనివల్ల నదిపై నిర్మించిన బ్రిడ్జి పునాది కూలిపోయే స్థితికి చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని కోరారు.

● 'కామాక్షమ్మ చెరువు వద్ద కొంత మంది దళితులకు వ్యవసాయ భూములు ఉన్నాయి. 40ఏళ్లుగా వంక పక్కన ఉన్న బండిబాటను దారిగా వాడుకుంటున్నాం. ప్రస్తుతం గ్రామానికి చెందిన అగ్రకులస్తులు బండిబాటను మూసేశారు. దీనివల్ల పొలాలకు దారి లేక ఇబ్బంది పడుతున్నాం' అని బంగారుపాళ్యం మండలం తంబుగానిపల్లె దళితులు ఆవేదన వ్యక్తం చేశారు.

రీసర్వేతో రికార్డులు అస్తవ్యస్తం



గతంలో జరిగిన రీసర్వేతో భూముల రికార్డులను అస్తవ్యస్తంగా మారిపోయి ఇబ్బంది పడుతున్నామని జీడీ నెల్లూరు మండలం పాచిగుంట పంచాయతీ రైతులతో కలిసి సర్పంచ్ విజయమ్మ ఫిర్యాదు చేశారు. మరోసారి సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు.


అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అండర్ పాస్‌తో ఉపయోగం లేదు



చిత్తూరు-తచ్చూరు ఎన్‌హెచ్ రహదారి నిర్మాణంతో తమ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన అండర్ పాస్‌తో ఉపయోగం లేదని చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామస్తులు తెలిపారు. వర్షం వచ్చినప్పుడల్లా అండర్ పాస్‌లో నాలుగు అడుగుల మేరకు వర్షపు నీళ్లు నిలిచి పోతోందన్నారు. అందువల్ల తమకు ముత్తుకూరు నుంచి తిరుత్తణి రోడ్డును ఏర్పాటు చేయాలని కోరారు.

వైన్‌షాపును మార్చండి



చిత్తూరు అమూల్ డెయిరీ సమీపంలోని వళ్లియప్ప నగర్, శివాజీనగర్ మధ్య ఏర్పాటు చేసిన ఈడిగ వైన్ షాపును వేరే ప్రాంతానికి మార్చాలని స్థానిక మహిళలు కోరారు. షాపునకు సమీపంలో ప్రభుత్వ హాస్టల్, టీటీడీసీ ట్రైనింగ్ సెంటర్‌కు నిత్యం వందలాది మంది మహిళలు వచ్చి వెళ్తుంటారని తెలిపారు. మందుబాబులు ఇక్కడ తిష్ఠ వేయడంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 36 అర్జీలు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 36 అర్జీలు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. భూ తగాదాలపై 15, డబ్బు తగాదాలపై 6, కుటుంబ తాగాలపై 3, చిన్నపాటి గొడవలపై 3, భర్త వేధింపులపై 2, దారి సమస్యలపై 2, ఆస్తి తగాదాపై ఓ అర్జీ చొప్పున అందాయన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

దుర్గంకొండలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- మధురమలై కొండలో అభిషేక పూజలు

సోమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంట సమీప మధురమలై కొండలో కొలువుదీరిన నేల మల్లేశ్వరస్వామికి సోమవారం భక్తులు అభిషేకపూజలు ఘనంగా నిర్వహించారు. దుర్గం కొండలోని గార్గేయ మునీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఆలయ అర్చకులు త్రివిక్రమరావు శివలింగాన్ని అలంకరించి అభిషేకాలు, పూజలు చేశారు. ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభించారు. ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, పట్రపల్లె, పేటూరు గ్రామస్తులు దుర్గంకొండకు చేరుకొని అన్నదానం కోసం సత్రాల ఏర్పాట్లు చురుగ్గా చేపట్టారు. కాగా 26, 27 తేదీల్లో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమల నుంచి పెద్దఉప్పరపల్లె, దుర్గం కొండలకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు పుంగనూరు ఆర్టీసీ డీఎం సుధాకరయ్య చర్యలు చేపట్టారు. సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయంలో శివకోటి జపయజ్ఞ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


ప్రత్యేక అలంకరణలో శివయ్య - మధుమలై కొండలో శివలింగానికి పూజలు

కలెక్టరేట్ ప్రాంగణంలో వర్మి కంపోస్టు స్టాల్ ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌లోని పీజీఆర్ఎస్ ప్రాంగణంలో వర్మి కంపోస్టు విక్రయ స్టాల్‌ను సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రారంభించారు. కిలో ప్యాకెట్ రూ.10లకే అందుబాటులో ఉంచడంతో ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్మి కంపోస్టు వాడితే పంట దిగుబడి పెరుగుతుందని చెప్పారు. డీపీవో సుధాకర్‌రావు, డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగరావు తదితరులు పాల్గొన్నారు.


వర్మి కంపోస్టు ప్యాకెట్ అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

గజదాడుల్లో పంటల ధ్వంసం

కల్లూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో ఆదివారం రాత్రి పంట పొలాలపై ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించాయి. దీంతో వరి, కొబ్బరి, అరటి, మామిడి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. శనివారం రాత్రి మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు మొదటిరోజు పాక్షికంగా పంటలకు నష్టం కలిగించాయి. రెండో రోజు ఎల్లంకివారిపల్లి పంచాయతీ దిగుమూర్తివారిపల్లి సమీపంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు ఏనుగుల విధ్వంసం కొనసాగింది. భీమవరం అటవీప్రాంతం నుంచి దిగువమూర్తివారిపల్లి వద్దకు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఏనుగుల గుంపు చేరుకుంది. గ్రామానికి సమీపంలోని ఎగువచెరువులో దిగాయి. ఏనుగుల ఘీంకారాలతో వాటిని గుర్తించిన గ్రామస్తులు టపాకాయలు పేల్చారు. అగ్గిమంటలు వేశారు. దీంతో అవి చెరువు నుంచి బయటకు వచ్చి పంటలను తొక్కేస్తూ పుణ్యంచెరువు వైపు వెళ్లాయి. సోమవారం వేకువజామున మళ్లీ ఇదేమార్గంలో తిరుగు ప్రయాణమైన ఏనుగుల గుంపు మరోసారి పంటలను ధ్వంసం చేస్తూ గుండాలమ్మ అడవిలోకి చేరుకున్నాయి. ఏనుగుల దాడిలో దిగుమూర్తివారిపల్లిలోని రైతు బాలకృష్ణమ నాయుడుకు చెందిన ఎకరా వరి పంట, 40 అరటిచెట్లు, 5 గుంటల మిరపపంట ధ్వంసమైంది. రైతు గోపి నాయుడికి చెందిన అర ఎకరా వరిపంట, రైతు వేణుగోపాల్ నాయుడికి చెందిన 7 కొబ్బరిచెట్లు, 6 మామిడిచెట్లు, నీటిపైపులు, రైతు మునిరత్నం నాయుడుకు చెందిన 15 టేకుచెట్లు, రైతులు పురుషోత్తం నాయుడు, చెంగ్రాయ నాయుడు, సుశీలమ్మకు చెందిన మామిడిచెట్లను ఏనుగులు విరిచేశాయి. ఉదయం అటవీశాఖ ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫి ధ్వంసమైన పంటలను పరిశీలించారు. ఏనుగులదాడిలో పంటలను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లిస్తుందని ఆయన తెలిపారు.


దిగుమూర్తివారిపల్లి వద్ద ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

అన్నదానానికి నిత్యావసర సరుకుల వితరణ



కుప్పం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మడలం మల్లప్ప కొండపై ఈ నెల 26వ తేదీన జరగనున్న మహాశివరాత్రి వేడుకల్లో భక్తులకు అన్నదానం కోసం బీసీఎన్ విద్యా సంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజు, వారి కుటుంబ సభ్యులు రూ.70 వేలు విలువ కలిగిన బియ్యం, ఉప్పు, పప్పు వంటి నిత్యావసర సరుకులను సోమవారం అందజేశారు. బీసీఎన్ చారిటబుల్ ట్రస్టు తరఫున ఈ వితరణ చేశారు. మల్లప్ప దేవస్థానం తరఫున లక్ష్మీనారాయణ వాటిని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ సుధాకరబాబు, లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గాజుల బలిజ కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ ఇవ్వాలి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న గోపీనాథ్

కుప్పం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజక వర్గంలోని గాజుల బలిజ కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్ ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజక వర్గ గాజుల బలిజ సంఘం అధ్యక్షులు పి.గోపీనాథ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. అమరావతిలో సోమవారం ఆయన సీఎంను కలిశారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలతోపాటు దక్షిణాది రాష్ట్రాలలోని చాలా ప్రాంతాల్లో బలిజ కులస్తులకు ఓబీసీ సర్టిఫికెట్లు ఇస్తున్నట్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో బలిజ కులస్తులకు కేటాయించిన రూ.2.46 ఎకరాల భూమిలో కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. తన అభ్యర్థనపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు గోపీనాథ్ తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు ముగిసిన ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

పలమనేరు, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం బీసీ కార్పొరేషన్ రుణాలకోసం దరఖాస్తు చేసుకొన్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సి పాలిటీ పరిధిలోని బీసీ, ఆర్య, వైశ్య, కాపు కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధికోసం రుణాలు అందించేందుకు బ్యాంకు అధికారులతో కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 714 మందిద రఖాస్తు చేసుకోగా అందులో 519 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీ. రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, మెప్మా అధికారి బాబా, మెప్మా సీఓలు, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలి: పారిశుధ్య కార్మికులు



నిరసనలో పారిశుధ్య కార్మికులు

పలమనేరు, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి): తమను పర్మినెంట్ చేయాలని పారిశుధ్య కార్మికులు సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు వారు ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు పారిశుధ్య కార్మికులకు వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.రామచంద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్. నాగరాజు, పలమనేరు సీపీఐ కన్వీనర్ చెన్నకేశవులు, ఏఐటీయూసీ నాయకులు బుర్రమంజునాథ్, యూనియన్ నాయకులు భూపాల్, మహేష్, సుమన్, వాసు, హెచ్‌బాబు, వెంకటరమణ, ఆనంద, రెడ్డెప్ప, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం



రామకుప్పం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పీఎంకేతాండాకు చెందిన టీడీపీ కార్యకర్త వెంకటేశ్‌నాయక్ ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం అతడి మృతదేహాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పార్టీ నేతలతో కలిసి సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ తరఫున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా, నియోజక వర్గ అధ్యక్షులు కృష్ణానాయక్, కామరాజనాయక్, ఎంపీటీసీ భూషణ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులుగౌడు, నాయకులు నందారెడ్డి, గజేంద్ర, మునిరాజ నాయక్, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సందర్శనతో సమస్యల పరిష్కారం

సోమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి సందర్శనలతో ప్రజా సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. సోమ వారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేది కలో అందిన వినతులను స్వీకరించారు. ఆవులపల్లె పంచాయతీలో ఇరి గేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సప్లయ్ చానల్ పనులను భూ ఆక్రమ ణదారులు అడ్డుకోవడంతో పనులు జరగడంలేదని భూసర్వే చేయాలని వివరించారు. చింతలవారిపల్లెలో శ్రీవాణి ట్రస్ట్ చేయూతతో నిర్మించనున్న ఆలయానికి ప్రభుత్వ భూమి కేటాయించాలని పలువురు గ్రామస్తులు తహసీల్దార్‌కు విన్నవించారు. పలు భూ సమస్యలపై వినతులు స్వీకరించారు. అనంతరం అందిన వినతులపై వీఆర్‌వోలతో సమీక్షించారు. మిట్ట పల్లెలో జరుగుతున్న రీ సర్వే పనులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీటీ ఇబ్రహీం, ఆర్ఐ సుబుక్తుల్లా, వీఆర్వోలు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం సయ్యద్ సాహెబ్ వల్లి

కల్లూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పదవ తరగతిలో వందశాతం ఫలితాలు సాదించాలని ఎంఈవో పోకల తాతయ్య, హెచ్‌ఎం సయ్యద్ సాహెబ్ వల్లి తెలిపారు. పులిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల వార్షికోత్సవం, టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంఈవో ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు బహు మతులు అందజేశారు.

నాగలరాళ్లకు ప్రత్యేక పూజలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని తోపు మఠం వద్ద వెలసిన నాగలరాళ్లకు భక్తులతో కలిసి బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు, భక్తులకు అన్నదానం చేశారు. బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, జగదీశ్‌రాజు, సురేశ్, రాజన్న, పలువురు మహిళలు పాల్గొన్నారు.

లాటరీ విక్రేత అరెస్ట్

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): లాటరీ విక్రేతను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. సోమవారం రాత్రి పట్టణానికి చెందిన నూర్‌బాషా లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. నిఘా ఏర్పాటు చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడు 160 టిక్కెట్లను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అతడి నుంచి రూ.10020 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన లాటరీ టిక్కెట్లను కొంతమంది రాజకీయ నాయకులు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

నేడు చికెన్ మేళా

గంగవరం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): గంగవరం మండలంలో మంగళవారం చికెన్, కోడిగుడ్ల మేళా నిర్వహిస్తున్నట్లు కోళ్లఫారాల యజమానులు, వ్యాపారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో చికెన్, కోడిగుడ్ల వినియోగం భారీగా పతనమవడంతో ఇక్కడ ప్రజల్లో భయాన్ని తొలగించేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మధ్యాహ్నం గంగవరంలోని ఎంబీఎస్ ఫంక్షన్ హాలు వద్ద ఈ మేళా నిర్వహిస్తున్నామని చికెన్, కోడిగ్రుడ్లు ఉచితంగా పంపిణీచేస్తామని ప్రకటించారు. బర్డ్‌ఫ్లూ మన ప్రాంతంలో లేదని చెప్పడానికే ఈ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలు పొందడానికి దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బైరెడ్డిపల్లె ఇండియన్‌బ్యాంక్, సప్తగిరి గ్రామీణబ్యాంక్, తీర్థం, కొలమాసనపల్లె గ్రామీణబ్యాంకుల ద్వారా అర్హులైన వారికి రుణాలు అందజేయడానికి ఇంటర్వ్యూలు జరిగాయి. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, బ్యాంకు మేనేజర్లు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కాళభైరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం - కోట్రేపల్లె సమీపంలో వున్న కాళభైరేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త రాజారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన వెంకటరమణారెడ్డి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పుంగనూరు- తిరుపతి మార్గంలోని భగత్‌సింగ్ కాలనీ సమీపంలో కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని మంగళం పంచాయతీ కంగానెల్లూరుకు చెందిన శ్రీనివాసులు కుమారుడు మాధవ(35) సొంత పనులపై ద్విచక్రవాహనంలో అగిస్తిగానిపల్లెకు వెళ్లాడు. పనులు పూర్తి చేసుకుని తిరిగి వస్తుండగా అగిస్తిగానిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి(65) పుంగనూరుకు తానూ వస్తానిని అతడి ద్విచక్రవాహనంలో ఎక్కాడు. భగత్‌సింగ్ కాలనీ వద్ద పుంగనూరు నుంచి ఓ కారు అతివేగంగా వచ్చి వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. మాధవ తీవ్రంగా గాయపడగా వెంకటరమణారెడ్డి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గాయపడిన మాధవను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ లోకేశ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

విద్యాసామగ్రి వితరణ



గంగవరం, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెట్టుమిట్ట సమీపంలో గల కేజీబీవీలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు దాతలు పరీక్షా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు , ఇతర సామగ్రి అందించారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు, దాతలు శ్రీపురం సీతారామయ్య, నరేంద్ర, ఎస్ఓ రోహిణి, పలువురు సీఆర్‌టీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతులు గుర్తింపు నెంబరు పొందాలి

కల్లూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రైతులందరూ విశిష్ట గుర్తింపు నెంబరు తప్పక పొందాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ తెలి పారు. పులిచెర్ల మండలం కల్లూరు రైతు సేవా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విశిష్ట గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంటల బీమా, సబ్సిడీ విత్తనాలు, పనిముట్లు, బ్యాంకు రుణాల కోసం విశిష్ట గుర్తింపు నెంబరు తప్పనిసరిగా ఉండాలన్నారు. మండలంలో రైతులు మొత్తం 10,200 మంది ఉండగా 3650 మంది మాత్రమే విశిష్ట గుర్తింపు కార్డులు తీసుకున్నారన్నారు. ఏవో హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక పొదుపు అలవాటు చేసుకోవాలి

రొంపిచెర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు పొదుపును అలవర్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఎస్‌జీవీ బ్యాంక్ మేనేజరు భువనేశ్వరరెడ్డి కోరారు. రిజర్వ్‌బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మహిళా సంఘ సభ్యులతో 'పొదుపు చేసే వనిత- సాధిస్తుంది ఘనత' అనే నినాదంపై వివరించారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సకన్య సంవృద్ధి యోజన, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఏపీఎం హరి, సీఎఫ్ఎల్ అనుసూయ తదితరులు పాల్గొన్నారు.

విరగబూసిన మామిడి పూత



సోమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మామిడి పూత ఆలస్యంగానైనా విరగబూస్తోంది. డిసెంబరు, జనవరి నెలలో పూత లేక రైతులు నిరాశ పడ్డారు. ఫిబ్రవరి నుంచి ఓదశలో తోతాపురి, బేనిషా రకం మోస్తరుగా పూత వచ్చింది. ఇప్పుడు మల్లికా రకం చెట్లలో పూత వస్తోంది. ఆలస్యంగా వస్తున్నా విపరీతంగా పూత పూస్తోంది. తోతాపురి 75శాతం, బేనిషా 70 శాతం లోపు పూతలు వచ్చాయి. ప్రస్తుతం మల్లికా రకం పూత చిగురిస్తోంది.

27, 28 తేదీల్లో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కుప్పం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల పరిధిలో బీసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం ఈ నెల 27, 2 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎల్.విజయదత్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల సచివాలయంలో 27వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలదాకా, తిరిగి 28 ఉదయం కూడా ఇదే సమయంలో బ్యాంకు మేనేజర్ల ద్వారా జరిగే ఇంటర్వ్యూలకు దరఖాస్తుదారులు తప్పక హాజరు కావాలని కోరారు. 27న దాసేగానూరు, కంగుంది 1, మహమ్మద్‌పురం, దేవరాజుపురం, కంగుంది-2, బ్రహ్మదేవరచేన్లు, అడవిబూదుగూరు, గుడ్లనాయనిపల్లె, చందం, గరిగచీనేపల్లె, కొత్తపల్లె, చెక్కునత్తం, కోటా లూరు, జరుగు, నూలుకుంట గ్రామాల వారు హాజరు కావాలని తెలియజేశారు. 28వ తేదీన క్రిష్ణదాసన పల్లె, పెద్దబంగారునత్తం, వెండుగంపల్లె, మల్లానూరు, టి.సదుమూరు, మోట్లచేను, మిట్టపల్లె, వానగుట్టపల్లె, గోను గూరు, మంకలదొడ్డి, వసనాడు, పైపాళ్యం, ఉర్లవోబనపల్లె, తదితర గ్రామాల దరఖాస్తుదారులు హాజరు కావాలని కోరారు.

గాయపడ్డ చింతకుప్పం యువకుడి మృతి



హేమాద్రి (ఫైల్‌ఫొటో)

రామకుప్పం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతిచెందాడు. రామకుప్పం మండలం చింతకుప్పంకు చెందిన హేమాద్రి ఇటీవల డిగ్రీ పూర్తిచేశాడు. బెంగళూరులో ఉద్యోగాన్వేషణలో ఉండగా 20 రోజుల క్రితం అక్కడి క్రిష్ణరాజపురం ఫ్లైఓవర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి గాయపడ్డాడు. అప్పటినుంచి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. సోమవారం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. ఆ గ్రామంలో విషాదం నెలకొంది.

టీడీపీ ఆర్థిక సాయం

హేమాద్రి మృతదేహాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పార్టీ నేతలతో కలిసి సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంజునాథరెడ్డి, రామలింగారెడ్డి, వెంకటరమణ, గజేంద్ర, కామరాజనాయక్, నవీన్, శ్రీరాములురెడ్డి, ఆదిల్, చంద్రశేఖరరెడ్డి, నాగరాజు, రామచంద్ర పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సతో గుండెకు భద్రత



సదస్సును ప్రారంభిస్తున్న వైద్య ప్రముఖులు

కుప్పం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గుండెకు సంబంధించిన ఇబ్బందులు తలెత్తినప్పుడు బీసీఎల్ఎస్ (ప్రథమ చికిత్స) వెంటనే అందించినట్లయితే ప్రాణాలు నిలపవచ్చని పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అభిరామి, మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ ఎన్‌కే.సుబ్రమణ్యం, ఐఆర్‌సీఎఫ్ ఛైర్మన్ ఎస్ఎస్‌సి.చక్రరావు అన్నారు. పీఈఎస్ నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ ఇంటర్న్ విద్యార్థులకు సోమవారం బీసీఎల్ఎస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రథమ చికిత్స విధానాన్ని కేవలం నర్సింగ్ విద్యార్థులే కాకుండా టీచర్లు, పోలీసు సిబ్బంది, ఆటో కార్మికులతోపాటు అన్ని విభాగాలకు చెందిన ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని, దానిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇందువల్ల ఏ ప్రాంతంలోనైనా ఎవరికైనా గుండె సమస్యలు ఎదురైతే వెంటనే బీసీఎల్ఎస్ విధానంలో ప్రథమ చికిత్స అందించి తర్వాత దగ్గర్లోని ఆస్పత్రికి చేర్చి వారి ప్రాణాలు నిలపవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డానియల్ కుమార్, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కార్పొరేషన్ రుణాలు : ఎంపీడీవో

కల్లూరు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ కార్పొరేషన్ రుణాలు ఇస్తామని ఎంపీడీవో రాజశేఖర్ బాబు తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశం మందిరంలో సోమవారం బీసీ, ఈబీసీ, కాపు, కమ్మ, రెడ్డి కార్పొరేషన్ రుణాల మంజూరుకు సంబంధిత బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. బ్యాంకు నిబంధనల మేరకు పార దర్శకంగా అర్హులను ఎంపిక చేస్తారని తెలిపారు. మండలానికి కేటాయించిన 50 యూనిట్ల రుణాల కోసం మొత్తం 265 మంది దరఖాస్తు చేసుకోగా 196 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు కార్యాలయం సూపరిం టెండెంట్ మునిరాజ తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు సురేష్, నాగేశ్వరరావు, మహేష్, శివశంకర్, హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అగస్త్యేశ్వరస్వామి శివరాత్రి కరపత్రాల ఆవిష్కరణ

రొంపిచెర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం నెక్కుంది పంచాయతీలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఈ నెల 26 నుంచి జరగనున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్లను రొంపిచెర్లలో పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. నెక్కుంది పంచాయతీకి చెందిన కళ్యాణ్, తిమ్మయ్య, వెంకటస్వామి, సుబ్రమణ్యం, నరేషబాబు, ఆదినారాయణ, మనోహర్, శ్రీనాథ్, ముకేష్‌లు చల్లారామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాలకు చల్లాబాబును ఆహ్వానించారు. ● ఐదేళ్ల క్రితం తెగిపోయిన సోమప్పచెరువుకు మరమ్మతులు చేయాలని సోమల మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు చల్లా రామచంద్రారెడ్డిని కోరారు.

ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వరుడు

పుంగనూరు: మండలంలోని నెక్కుంది సమీపంలో వెలసిన అగస్త్యేశ్వరస్వామి సోమవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శివరాత్రి ఉత్సవాలల్లో భాగంగా అర్చకులు అఖిలేష్‌చార్యులు స్వామి వారికి రుద్రహోమం, కళాహోమం జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. సాయంత్రం నిత్యోత్సవాలు నిర్వహించారు. ● పుంగనూరు సమీపంలోని బైపాస్‌రోడ్డులో వెలసిన సోమేశ్వరస్వామిని ఆలయ అర్చకులు శంకర్‌శర్మ ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చ నలు చేసి భక్తులకు దర్శనభాగ్యం ంచారు.



దళిత సమస్యలపై అధికారులకు నిర్లక్ష్యం తగదు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): దళితుల సమస్యలపై నిర్లక్ష్యం తగదని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ సమావేశాలకు అధికారులు హాజరుకాకపోవడం తగదన్నారు. ప్రతి నెలా నిర్వ హించాల్సిన సమావేశం మూడు నెలలకోసారి నిర్వహించడంలో నిర్లక్ష్యం తెలుస్తోందన్నారు. అధికారులు తమ విధానం మార్చుకుని దళితుల సమ స్యలు పరిష్కరించాలని కోరారు. ఎస్ఐ లోకేశ్, తహసీల్దార్ రాము, ఎంపీడీవో లీలామాధవి, సంఘ నాయకులు రామయ్య, జీవనజ్యోతి, వెంకటరమణ, శ్రీని వాసులు, చిన్నబ్బ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ధ్యేయం

పుంగనూరు, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీసీ, కాపు, ఈబీసీ, కమ్మ, రెడ్డి కులస్తుల యువతీ, యువకులకు బ్యాంకు అధికారులు కార్పొరేషన్ రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండల పరిధిలో 346మంది దరఖాస్తు చేసుకోగా 328మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఆమె తెలిపారు. ఇండియన్, స్టేట్‌బ్యాంక్, యూనియన్, ఆంధ్ర, కెనడా, సప్తగిరి తదితర బ్యాంక్ అధికారులు హాజరై ఇంటర్వ్యూలు చేశారు.

వైభవంగా మహాకుంభాభిషేకం

పలమనేరు, ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు అటవీ ప్రాంతంలోని దేవళంపేట వద్ద వెలసిన వందన మల్లేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేకం సోమవారం వైభవంగా నిర్వహించారు. వందల ఏళ్లక్రితం నిర్మించిన ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకొంది. దీంతో గ్రామస్తులు, భక్తులు విరాళాలు సేకరించి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. ఈ నెల 22న గణపతిపూజ, రక్షాబంధనం, పంచగవ్యం, ధ్వజారోహణం, కలశస్థాపన, గణపతిహోమం, వాస్తుహోమాలు, 23న నిత్యకలశారాధన ప్రధాన హోమం, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు నిర్వహించారు. 24వ తేదీ సోమవారం కలశహోమం, కళశాభిషేకం, రుద్రాభిషేకం, గోపూజ, దర్పదర్శనం, బలి, పూర్ణాహుతి జరిపించారు. ఈ కార్యక్రమాల్లో వేదపండితులు, ఆలయ అర్చకులు, వివిధగ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



ఆలయం వద్ద కోలాహలం

ఆలయంలో విశేష అలంకరణలో స్వామివారు

గడ్డివామి దగ్ధం

సోమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నెల్లిమంద పంచాయతీ చింతలవారిపల్లెకి బాలసుబ్రహ్మణ్యానికి చెందిన గడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. పుంగనూరుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపుచేశారు. రూ.20వేల విలువైన గడ్డి కాలిపోయిందని బాధితుడు వాపోయాడు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ● మండలంలోని ఆవులపల్లె - పెద్ద ఉప్పరపల్లె మార్గంలోని కలమందలవారిపల్లె వద్ద సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు కంచెకు నిప్పు పెట్టారు. ఆ మంటలకు సమీపంలోని టమోటాకు ఊతంగా నాటే కర్రలు కాలిపోయాయి. సమీప రైతులు మంటలను అతికష్టంపై అదుపుచేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



ఒంటిమిట్టలో చల్లా రామచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పని చేస్తోందని టీడీపీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చంద్రమాకులపల్లె పంచాయతీ ఒంటిమిట్ట గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి విగ్రహ ప్రతిష్ఠలో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే జీర్ణించుకోలేని వైసీపీ నాయకులు ఉనికి కోసం బురద చల్లే రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, ఉయ్యాల రమణ, గంగాధర్, మోహన్‌రెడ్డి, చక్రి, వేణుగోపాల్, కోలాట వెంకటరమణ, రాఘవ, రవికుమార్, నారాయణరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, హరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాల వేలం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను మంగళవారం బహిరంగ వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ సీఐ సురేశ్‌రెడ్డి తెలిపారు.

టీబీ, కుష్ఠుపై అవగాహన

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): టీబీ, కుష్ఠు వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని టీబీ సూపర్‌వైజర్ సిద్ధార్థ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక శుభారాం ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు టీబీ, కుష్ఠుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఏఎన్ఎం భారతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉడాలని సీఐ శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో 'నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్' ఆధ్వర్యంలో విద్యార్థులకు బెట్టింగ్ యాప్‌ల వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ ఫోర్స్ కార్యదర్శి సల్మా, ఎంఈవో చంద్రశేఖర్, పాఠశాల హెచ్‌ఎం. ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల పల్లకీసేవ

సోమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ గన్నావారి పల్లెలోని సీతా రామాలయ వార్షిక ఉత్సవాలను పురస్కరించుకొని స్వామి వార్లకు పల్లకీ సేవలు ఘనంగా నిర్వహించారు. పల్లకీలో ఉత్సవ మూర్తులను అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మెరిట్ విద్యార్థికి నగదు అందిస్తున్న సర్పంచ్ ఇబ్రహీంఖాన్

రొంపిచెర్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) పదవ తరగతి పబ్లిక్ పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని రొంపిచెర్ల సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్ ఆకాంక్షించారు. సోమవారం రొంపిచెర్లలోని ఉర్దూ, కేజీబీవీ, ఆదర్శపాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాలు జరిగాయి. సరస్వతి పూజలు చేసి విద్యార్థులను ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. ఉర్దూ పాఠశాల లో గత ఏడాది పదవ తరగతి పరీక్షలో 523 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానంలో నిలిచిన పటాన్ హర్షియాకు రూ.10 వేలు సర్పంచ్ సొంత నగదు బహూకరించారు. ఇలాగే వచ్చే ఏడాదీ ఇస్తానన్నారు. వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యా ర్థులకు బహుమతులు ఇచ్చారు. ఎంఈవో శ్రీనివాసులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సరళ, హెచ్‌ఎం సుజాత, వి.ప్రకాష్, నసీమ్, అక్బర్ బాష, ఖాదర్‌బాష, టీడీపీ నాయకులు బాబులాల్, రఫీ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ధర్నా



చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం చిత్తూరు నగరపాలక కార్యాలయం ఎదురుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పర్మినెంట్ కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రయ్య, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. పర్మినెంట్ ఉద్యోగులకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ డీఏలను విడుదల చేయాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి.. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కార్మికులకు అందేలా చూడాలన్నారు. ఏఐటీయూసీ నేతలు గోపీనాథ్, మణి, చంద్ర, రమాదేవి, యూనియన్ నేతలు విజయ్ కుమార్, వాసు, దొరస్వామి,సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నగరిలోనూ..

నగరి: మున్సిపల్ కార్యాలయం ఎదుట కూడా సోమవారం పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక యూనియన్ గౌరవాధ్యక్షుడు కోదండయ్య, నాయకులు వేలన్, మురళి, శేఖర్, రవి, నాగరాజు, కుమార్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేపై తనిఖీ

యాదమరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): యాదమరి మండలపరిధిలో చేపడుతున్న పీ4 సర్వేపై తనిఖీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ సభ్యుడు రోహిత్ పరిశీలించారు. విజన్-2047 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్, పార్టనర్‌షిప్) సర్వేపై తనిఖీల్లో కోణాపల్లె పంచాయతీ కార్యదర్శి కల్పన, ఏఎస్వో ఉదయ్, సిబ్బంది పాల్గొన్నారు. కుటుంబ సభ్యుల బియ్యం కార్డులు, విద్యుత్ బిల్లులు, సాంకేతికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ.. పేదరికం లేని సమాజం నిర్మాణంలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న జనాభా గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీ ప్లానింగ్ కమిటీ సభ్యుడు రోహిత్

మంచినీటి శుద్ధి కేంద్రం తెరిపించడానికి చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాదమరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మూతపడిన మంచినీటి శుద్ధి కేంద్రాన్ని తెరిపించడానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉష, ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, సచివాలయ అధికారులు తెలిపారు. ఈ కేంద్రం మూతపడటంపై ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమవడంతో వారొచ్చి పరిశీలించారు. అనంతరం మురుగు కాల్వను ఈవోపీఆర్డీ సుకుమార్ రెడ్డి, వీఆర్వో సురేష్ పరిశీలించి చెత్తను శుభ్రం చేయనున్నట్లు తెలిపారు.



మంచినీటి శుద్ధి కేంద్రం వద్ద అధికారులు

సీఆర్‌రెడ్డికి నివాళి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'విద్య, సాహిత్యం, రాజకీయ, సేవా రంగాల్లో సీఆర్‌రెడ్డి తనదైనముద్ర వేశారు. ఆయన మన జిల్లావాసి కావడం గర్వకారణం' అని సీఆర్‌రెడ్డి స్మారకట్రస్టు సభ్యుడు శ్రీధర్‌రెడ్డి చెప్పారు. సోమవారం సీఆర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా బీవీరెడ్డికాలనీలో ఉన్న సమాధి వద్ద, కలెక్టర్ బంగ్లా సమీపంలోని విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అభినందన

నగరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని ముడిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు చెస్ పోటీల్లో ప్రతిభ చూపారని టీచర్లు తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో నవ్యశ్రీ 2వబహుమతి, అండర్-11 బాలికల విభాగంలో దీప 5వ బహుమతిని, అండర్-9 బాలుర విభాగంలో తిరుమల 4వ బహుమతిని సాధించారన్నారు. వీరితోపాటు రూపకేశవ, అబుబాకర్, సిద్ధిక్, లీలాప్రసాద్, జగన్‌లు కన్సొలేషన్ బహుమతులను అందుకున్నారని చెప్పారు. వీరిని పాఠశాలలో సోమవారం అభినందించారు.



భూత వాహనంపై ఏకాంబరేశ్వరుడు



యాదమరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమంలోని ఏకాంబరేశ్వర కామాక్షి అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఉదయం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం స్వామివారు భూతవాహనంపై జగద్రక్షకుడిగా గ్రామంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి కల్పవృక్ష వాహనంలో విహరించారు. ఉభయదారులు కేశవపిళ్లై, చంద్రశేఖర్ రెడ్డి, అర్చకుడు కాసలనాటి చంద్రశేఖర్ శాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

బావా ఎలా ఉన్నావురా..!

బీజడ్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సందడి

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బావా ఎలా ఉన్నావురా.. పిల్లలు ఎంత మంది.. ఏం చేస్తున్నారని.. కుశల ప్రశ్నలు. పాఠశాలకు లేటుగా వచ్చావని టీచర్ మోకాళ్లపై నిలబెట్టిన సంఘటనలు, స్కూల్‌కు ఎగ్గొట్టి తిరిగిన రోజులు గుర్తు చేసుకుంటూ నవ్వులు. ఇలా సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 1986-87లో పదో తరగతి చదివిన బీజడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కలుసుకుని సందడి చేశారు. కాగా, తమ బడిని పడగొట్టేయడంతో పీవీకేఎన్ డిగ్రీ కాలేజీలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు రమేష్, అంజాద్, అంజలి, డిల్లీకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌పీఎం షాపు ప్రారంభం

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని తాటిమాకులపల్లె గ్రామంలో నాన్ పెస్టిసైడ్ మేనేజ్మెంట్(ఎన్‌పీఎం) షాపును ప్రకృతి వ్యవసాయ వనరుల సేవా కేంద్రం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు సోమవారం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ సాగుకు కావాల్సిన కషాయాలన్నీ ఈ షాపులో అందుబాటులో ఉంటాయన్నారు. హెచ్‌ఆర్ గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన చేయండి: కమిషనర్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం ఆరు అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. ఇంజనీరింగ్‌కు 3, రెవెన్యూకు 2, పబ్లిక్ హెల్త్‌కు ఒక అర్జీ చొప్పున ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వృద్ధుడి నుంచి అర్జీ స్వీకరిస్తున్న నరసింహ ప్రసాద్

గ్యాస్ సిలిండర్ ధరకంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ ధర కంటే ఎక్కువ వసూలు చేసే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ విద్యాధరి సూచించారు. సోమవారం సాయంత్రం జేసీ కాన్ఫరెన్స్ హాలులో గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ దీపం-2 పథకం అమలుచేస్తున్నట్లు చెప్పారు. బిల్ ధర కంటే అధిక మొత్తాలు వసూలు చేయకుండా డెలివరీ బాయ్స్‌ను కట్టడి చేయాలని ఆదేశించారు. లేదంటే సంబంధిత ఏజెన్సీలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీఎస్వో శంకరన్ తదితరులు పాల్గొన్నారు.



← గ్యాస్ ఏజెన్సీ డీలర్లతో సమీక్షిస్తున్న జేసీ విద్యాధరి

వేడుకగా ధ్వజారోహణం

పూతలపట్టు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.జి.మిట్టూరు గ్రామం సమీపాన ఉన్న బాటగంగమ్మ ఆలయం వద్ద శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం ధ్వజారోహణం జరిగింది. కార్యనిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



డీఏ బకాయిలు ఇప్పించండి

జేసీకి సింగిల్ విండో ఉద్యోగ సంఘం వినతి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): 'జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘా (సింగిల్ విండో)ల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 2023 ఆగస్టు నుంచి డీఏ బకాయిలు ఇవ్వలేదు. వెంటనే ఇప్పించండి' అని సింగిల్ విండో ఉద్యోగసంఘ జిల్లా అధ్యక్షుడు వి.ఎస్. విజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ విద్యాధరిని పలువురు నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. పదవీవిరమణ చేసిన ఉద్యోగులకు రూ.10లక్షల గ్రాట్యుటీ ఇప్పించాలన్నారు. 20 ఏళ్లుగా ఉన్న తమ సంఘానికి శాశ్వత భవనం లేదని, చిత్తూరు నగరంలో ఐదు సెంట్ల భూమిని కేటాయించాలని విన్నవించారు. సంఘ ప్రధాన కార్యదర్శి బి.రమేష్, గౌరవాధ్యక్షుడు కె.తులసి, తదితరులు పాల్గొన్నారు.



జేసీకి పుష్పగుచ్ఛమిస్తున్న నాయకులు

వరసిద్ధుడి అన్నదానానికి రూ.2లక్షల విరాళం



అధికారులకు చెక్కును అందిస్తున్న రామకృష్ణారావు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి బెంగుళూరుకు చెందిన రామకృష్ణారావు రూ.1,00,116 చెక్కు రూపంలో అందించగా, హైదరాబాద్‌కు చెందిన మణికంఠ రూ.1,00,116ను సోమవారం విరాళంగా అందించారు. టీటీడీ బోర్డు సభ్యురాలు అనుగోలురంగశ్రీ సోమవారం వరసిద్ధి వినాయక స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

బీటెక్ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో 'విజయం' ప్రతిభ



మోనికాశ్రీ - సాగర్ నరేంద్ర - జయదేవ్

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ప్రకటించిన ఇంజనీరింగ్ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల్లో విజయం విద్యార్థులు ప్రతిభ చూపారని విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి తెలిపారు. ఏఐ/డీఎస్ విభాగంలో పి.మోనికాశ్రీ (911), ఎన్.దుర్గశ్రీ (903), జి.హాసిక (903), సీఎస్ఈలో సాగర్ నరేంద్ర (910), పి.తేజేశ్వరి (902), ఈసీఈలో కె.జయదేవ్ (874) మార్కులు సాధించినట్లు తెలిపారు. వీరిని అకడమిక్ డైరెక్టర్ శైలజామూర్తి, ప్రిన్సిపాల్ గోపి అభినందించారు.

ఘనంగా అపోలో హాస్పిటల్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి

తవణంపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అరగొండ అపోలో హాస్పిటల్ 25వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నై అపోలో ఆస్పత్రికి చెందిన ప్రముఖ ఎముకలు, కీళ్ల మార్పిడి వైద్య నిపుణుడు డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అరగొండ అపోలో ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్లు శ్రీధర్, సుకవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



కార్వేటినగరంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవోలు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని కార్వేటినగరం ఎంఈవోలు మంచికాయల విజయకుమార్, డీపీ మనోజ్‌కుమార్ సూచించారు. సోమవారం కార్వేటినగరం లక్ష్మీనరసింహ విద్యాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలను ప్రారంభించారు. విద్యాసంస్థ అధినేత ఎ.దిలీప్‌కుమార్, డైరెక్టర్లు వెంకటేష్, ధనంజయరెడ్డి, పురుషోత్తం, రమణ, కళాశాల ప్రిన్సిపాల్ కిషోర్, హెచ్‌ఎంలు మహేశ్వరరాజు, జమున, ఏవో నరేష్ పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల వితరణ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం కమ్మకండ్రిగ సమీపంలో ఉన్న స్వయంభు సిద్ధేశ్వర స్వామి దేవస్థానానికి కమ్మకండ్రిగకు చెందిన పోలంపల్లి మునికాంత, గిరిబాబు దంపతులు సోమవారం శివపార్వతుల పంచలోహ విగ్రహాలను ఆలయ ధర్మకర్త బట్టే చాణిక్యప్రతాప్‌కు అందజేశారు. అలాగే తిరుపతి సమీపంలోని చిగురువాడకు చెందిన ఎర్రంశెట్టి ప్రియాంక, తేజస్‌కుమార్ వితరణతో నక్షత్ర హారతి, కుంభహారతిని ధర్మకర్తకు ఇచ్చారు. గోడేసి నాగరాజు, బట్టే రిపుంజయ, చెండిగ రోహిత్‌కుమార్, పోలంపల్లి నాగార్జున, అనమల చూడామణి, బట్టే శశికుమార్ పాల్గొన్నారు.



మామిడి తోపునకు దారి వసతి కల్పించండి

- కలెక్టర్‌కు మహిళా రైతు విజ్ఞప్తి

పూతలపట్టు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తన మామిడితోపునకు వెళ్లడానికి దారి వసతి కల్పించాలని గాండ్లపల్లె గ్రామానికి చెందిన జయమ్మ అనే మహిళా రైతు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. పాలకూరు రెవెన్యూ పరిధిలో రెండెకరాలకుపైగా మామిడితోపు ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వభూమిలో వెళుతుండే వారమని, ఆ ప్రభుత్వస్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకుని దారి లేకుండా చేశాడని ఆరోపించారు. విచారించి, న్యాయం చేయాలని వేడుకున్నారు.



జయమ్మ

మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం చిత్తూరు ఆర్టీసీ 1, 2-డిపో నుంచి ప్రముఖ శివాలయాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీపీటీవో జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మొగిలి, సిద్దేశ్వరకొండ, ముఠాలం, వెదురుకుప్పం, పెనుమూరు, పచ్చకాపల్లంకు చిత్తూరు బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

వైభవంగా కాలభైరవేశ్వరుడి ధ్వజారోహణం

తవణంపల్లె, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కాలభైరవేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదారులుగా పద్మశాలి కులస్తులు వ్యవహరించారు. అనంతరం మూలవిరాట్‌కు అన్నాభిషేకం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని శేష వాహనంపై ఉంచి మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. శేషవాహనం ఉభయదారులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్‌నాయుడు, వినాయకం, ధనశేఖర్ పాల్గొన్నారు.



← శేష వాహనంపై స్వామివారు



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు →



పాత ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద రోడ్డుపై కాలం చెల్లిన వాహనాలు

ఇలాగైతే 'స్వచ్ఛ ఆంధ్ర' సాధ్యమేనా?

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతినెలా మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం నిర్వహిస్తోంది. అయితే కొన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో కాలం చెల్లిన వాహనాలను తొలగించడం లేదు. వీటి వల్ల అపరిశుభ్ర వాతావరణంతో పాటు విషపురుగులకు ఆవాసంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో రోడ్లపైనే ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇలా.. పాత ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద దశాబ్దాలుగా రోడ్డుపైనే కాలం చెల్లిన వాహనాలున్నాయి. దీనిపక్కనే జిల్లా అగ్నిమాపక కేంద్రం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక వాహనం వెళ్లేటప్పుడు ఈ కాలం చెల్లిన వాహనాలవల్ల ఇబ్బందులు వస్తున్నాయి. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి వీటిని తొలగించాల్సి ఉంది.

సంక్షిప్తంగా..

ఎరువుల కేంద్రం ప్రారంభం

పూతలపట్టు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మన గ్రోమోర్ సెంటర్‌ను సోమవారం మండల వ్యవసాయశాఖ అధికారి మధురవాణి ప్రారంభించారు. చిత్తూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పుష్పరాజ్, ఏరియా మేనేజర్లు సూర్యనారాయణ,రమేష్, స్టోర్ మేనేజర్ సాయి మనోహర్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

నింద్ర, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్‌సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 162 మంది దరఖాస్తు చేసుకోగా, 119మంది హాజరయ్యారని ఎంపీడీవో శివప్రసాద్ వర్మ తెలిపారు.

శ్రీరంగరాజపురం: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు 378 మంది దరఖాస్తు చేసుకోగా.. 274మంది హాజరయ్యారని ఎంపీడీవో మోహన మురళి తెలిపారు.

రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

పాలసముద్రం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ అరుణకుమారి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షించారు. ప్రధానంగా రీసర్వేలో జరిగిన తప్పులపై వచ్చిన అర్జీలు పరిష్కారం ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని చెప్పారు. డీటీ రిషివర్మ, ఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

పాలసముద్రం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆముదాల, బాలకృష్ణాపురం, వనదుర్గాపురం, తిరుమలరాజుపురం పంచాయతీల్లో నిర్వహించే ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి కోరారు. సోమవారం ఆముదాలలో నిర్వహించిన ఆధార్ క్యాంప్‌ను ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఈవోపీఆర్డీ రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘ నేత మృతికి సంతాపం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సంఘ నేత బసవరాజు భాస్కరరాజు సోమవారం పుత్తూరులో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్టీయూ నేతలు గాజుల నాగేశ్వరరావు, యువరాజు, ఆనంద్, పగడాల త్రివేణి, జయదేవ్, చంద్ర తదితరులు సంతాపం తెలిపారు. పుత్తూరు ప్రాంతంలో ఉపాధ్యాయ ఉద్యమానికి నాంది పలికిన పోరాట యోధుడు అని, ఏపీటీఎఫ్ సంఘ నేతగా, పెన్షనర్ల భవన నిర్మాతగా పేరు తెచ్చుకున్నారని గుర్తు చేసుకున్నారు.



భాస్కరరాజు (ఫైల్‌ఫొటో)

'పీవీకేఎన్'కు న్యాక్ ఏ గ్రేడ్‌పై హర్షం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ రావడంపై చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ బృందం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతిని సొసైటీ సభ్యులు సత్య, అశోక్‌కుమార్, శివకుమార్, శ్రీనివాసులు, మల్లికార్జున్, రషీద్‌లు కలిసి అభినందనలు తెలిపారు.

జీడీనెల్లూరుకు ప్రభుత్వ ఖాజీ నియామకం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):జీడీనెల్లూరు నియోజకవర్గానికి ఖాజీని నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఖాజీగా కార్వేటినగరం మండలం మసీదు వీధికి చెందిన కె.మొహమ్మద్ ఆలీ కుమారుడు కె.జాఫర్ ఆలీని నియమించారు.